సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 13 । జూన్ । 2023



27 నుంచి సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 27 నుంచి టీటీడీ తొలిసారిగా నిర్వహించనుంది. - 8లో



సురక్షిత ప్రయాణం ఉచితం

జిల్లాలోని ఆరు ఆర్టీసీ డిపోల నుంచి విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత రాయితీ బస్సు పాసులు అందించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. - 8లో



గ్రేడింగ్‌లో మార్పుతో పసుపు రైతుల్లో హర్షం

పసుపు కొనుగోళ్లలో గ్రేడింగ్‌ను సరళతరం చేయడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. - 8లో

అందరికీ విద్య ప్రభుత్వ లక్ష్యం

- విద్యారంగంలో సమూల మార్పులకు సీఎం కృషి
- నాడు- నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు సకల సౌకర్యాలు
- జిల్లా వ్యాప్తంగా 1,58,156 మందికి లబ్ధి
- ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా
- గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో ఘనంగా నాలుగో విడత జగనన్న విద్యాకానుక పంపిణీ



పంపిణీ చేసిన విద్యాకానుక కిట్లతో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

కడప ఎడ్యుకేషన్: విద్యకు పేదరికం అడ్డుకాకూడదు. ప్రతి పేద విద్యార్థి చదువుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యాకానుక పథకం ద్వారా విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రి అందిస్తున్నారు.. అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా పేర్కొన్నారు. సోమవారం కడపలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో నాలుగో విడత జనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ పిల్లల చదువులు పేదవారికి ఏ మాత్రం ఆర్థికభారం కాకూడదని, కార్పొరేట్ స్థాయి విద్య అందరికీ అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. విద్యార్థుల చదువుతోపాటు వారి ఆరోగ్యం కోసం స్వయంగా ముఖ్యమంత్రే మెనూకు రూపకల్పన చేశారన్నారు. పిల్లలకు అందించే జగనన్న విద్యాకానుక విషయంలో కూడా ముఖ్యమంత్రే స్వయంగా నాణ్యతను పరిశీలించడం అభినందనీయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు జగనన్న విద్యాకానుక పథకం ద్వారా 47,40,421 మంది విద్యార్థులకు రూ. 19674 కోట్లు ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య, జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, నగర కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా హాజరయ్యారు.

- కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం విద్యార్థులకు 8 రకాల వస్తువులతో కూడిన జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి, డీఈఓ రాఘవరెడ్డి, ఎంఈఓ పాలెం నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్యసుజాతమ్మ, కార్పొరేటర్లు షఫీ, శ్రీరంజన్‌రెడ్డి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, సభ్యులు విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషంగా చదువుకుంటున్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు కల్పిస్తున్న వసతులతో సంతోషంగా చదువుకుంటున్నాం. అమ్మ ఒడి, విద్యాకానుక ద్వారా చదువుకోసం ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంగ్లీష్ మీడియంలో విద్యను అభ్యసిస్తున్నాం. - మంజునాథ, విద్యార్థి

అన్ని రకాల అభివృద్ధి



మేము చదువుతున్న పాఠశాలకు నాడు-నేడు కింద అన్ని రకాల వసతులు కల్పించారు. మా పాఠశాలలోకి అడుగు పెట్టగానే ఏదో కార్పొరేట్ స్కూల్లోకి అడుగు పెట్టినట్లు ఉంది. - వసీమ్, విద్యార్థి

మా అదృష్టం



కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులకు జగన్ మామయ్య ప్రభుత్వం ఎంతో ఆదిరిస్తోంది. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి తల్లిఖాతాకు ఏడాదికి రూ. 15 వేలు జమ చేస్తున్నారు. చదువుకోసం అన్ని రకాల వస్తువులను ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. - నవీన , విద్యార్థి

ధనికులతో సమానంగా పేదలకు విద్య: జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన వంటి సంక్షేమ పథకాలతో ధనవంతులతో సమానంగా పేదవారికి విద్య అందుతోందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని 430 పాఠశాలలకు 1109 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానల్(ఐఎఫ్‌పి)లు, 530 స్మార్ట్ టీవీలు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు అభ్యసించాలన్నారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు: కలెక్టర్ విజయరామరాజు

పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తోందని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అన్నారు. సమాజంలో విద్య, ఆర్థిక రంగాల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలంటే ఒక్క విద్యతోనే సాధ్యమన్నారు. నాడు- నేడు కార్యక్రమం ద్వారా జిల్లాలో మొదటి దశలో రూ. 275 కోట్లతో 1040 పాఠశాలను అభివృద్ధి చేయగా , రెండవ దశలో రూ. 290 కోట్లతో 1006 పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో 11 రకాల మౌలిక వసతులు కల్పించామన్నారు.

ఒకరు విద్యావంతులైతే కుటుంబం మొత్తం అభివృద్ధి: నగర మేయర్ సురేష్‌బాబు

ఒక ఇంట్లో ఒక్కరు విద్యావంతులైతే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి పథంలో నడిచే అవకాశం ఉంటుందని నగర మేయర్ సురేష్‌బాబు అన్నారు. పాఠశాలలు ప్రారంభం రోజునే పిల్లలకు విద్యాకానుక పేరుతో విద్యకు అవసరమైన అన్ని రకాల వస్తువులను ఇవ్వడం గర్వించదగ్గ విషయం అన్నారు. విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి ఆశయ సాధనలో ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వాములు కావాలన్నారు.

విప్లవాత్మక మార్పులు: ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చి విద్యకు పెద్దపీట వేశారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించేలా కృషి చేయాలన్నారు.

తప్పిన ఆర్థికభారం: సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి ప్రభాకర్‌రెడ్డి

తల్లిదండ్రులకు తమ పిల్లల చదువు ఆర్థికభారం కాకూడదనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యాకానుక పేరుతో కిట్‌లను అందిస్తున్నారని సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 1,58,156 మందికి విద్యాకానుక కిట్లు అందిస్తున్నామన్నారు.

న్యూస్‌రీల్

తొమ్మిది మందికి తహసీల్దార్లుగా పదోన్నతి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో పనిచేస్తున్న తొమ్మిదిమంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఈనెల 8వ తేదీ నిర్వహించిన డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ)లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జోన్-4లో 45 మందికి పదోన్నతులు లభించగా, అందులో వైఎస్సార్ జిల్లాకు చెందిన వారు తొమ్మిది మంది ఉన్నారు. వారిలో ఏవీ రమణమ్మను వైఎస్సార్ జిల్లాకు, బి.నరేంద్రకుమార్‌ను సత్యసాయి జిల్లాకు, ఎ.శివరామసుబ్బయ్యను తిరుపతి జిల్లాకు, వి.వెంకట సుబ్బయ్యను వైఎస్సార్ జిల్లాకు, సి.గుర్రప్ప, ఎం.శరత్, బి.లక్ష్మీదేవిలను వైఎస్సార్ జిల్లాకు, కె.జనార్దన్‌రాజును తిరుపతి జిల్లాకు కేటాయించారు. అలాగే కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న వి.రాజారావు, బి.సువర్ణదేవిలను వైఎస్సార్ జిల్లాకు కేటాయించారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్: పేదలందరికీ ఇళ్ల పథకం కింద జిల్లాలో చేపడుతున్న జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని జాయింట్ కలెక్టర్ జి.గణేష్‌కుమార్ క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా జరుగుతున్న గృహ నిర్మాణాలను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్య సాధనపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఏపీ మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లాలో ఏపీఆర్‌ఈఐ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కడప(మైనార్టీ బాలుర) వేంపల్లి(మైనార్టీ బాలికలు) గురుకుల పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్, ప్రిన్సిపల్ అబ్దుల్ రసూల్ తెలిపారు. 5వ తరగతిలో అన్ని సీట్లకు అలాగే 6,7,8 తరగతులలో మిగిలి ఉన్న సీట్లకు ముస్లిం, దూదేకుల మైనారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ https://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 7780179446, 9701133148 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

వైవీయూ: విశ్వవిద్యాలయం పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించి పదోన్నతులు కల్పించాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.రామకృష్ణ కోరారు. సోమవారం వైవీయూలో వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పాలకమండలిలో ఎస్టీ ప్రభుత్వ అధ్యాపకులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పి. చంద్రశేఖర్, కార్యదర్శి శ్రీనివాసులు, ఆంజనేయులు నాయక్, రమణ, బాలాజీ నాయక్, హనుమంతు నాయక్, వెంకటేష్, గోవింద నాయక్, బాబాఫకృద్దీన్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ఉద్యోగావకాశాలు

కడప రూరల్: జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో కాంట్రాక్టు ప్రాతిపదికన స్థిర గౌరవ వేతనంపై పనిచేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ అధికారి తెలిపారు. క్లినికల్ సైకాలజిస్ట్, సీనియర్ ఫిజియోథెరపిస్ట్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్, ఆర్థోపెడికల్లీ హ్యాండీక్యాప్డ్ సీనియర్ ప్రొస్తెటిస్ట్, ఆర్థోటిస్ట్ టెక్నీషియన్, సీనియర్ స్పీచ్ థెరపిస్ట్ ఆడియాలజిస్ట్, హియరింగ్ అసిస్టెంట్, జూనియర్ స్పీచ్ థెరపిస్ట్, మొబిలిటీ ఇన్‌స్ట్రక్టర్, మల్టీపర్పస్ రిహాబిలిటేషన్ వర్కర్, అకౌంటెంట్ కమ్ క్లర్క్ కమ్ స్టోర్ కీపర్, అటెండెంట్ కమ్ ప్యూన్ మెసెంజర్, ఫీల్డ్ అండ్ పబ్లిసిటీ అసిస్టెంట్, ఒకేషనల్ కౌన్సెలర్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులకు ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 08562-295480 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఆన్‌లైన్ ద్వారా బిల్డింగ్‌ప్లాన్ అనుమతులు

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ ద్వారా బిల్డింగ్ ప్లాన్ అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని డీఎల్‌టీఓలు, ఈఓపీఆర్అండ్‌ఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం మార్చి 1వ తేదీ నుంచి గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ ద్వారా బిల్డింగ్ అనుమతులను మంజూరు చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. అయితే గ్రామ పంచాయతీల్లో ఈ విధానాన్ని ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఇకనుంచైనా కచ్చితంగా బిల్డింగ్ ప్లాన్ అనుమతులను ఆన్‌లైన్ విధానంలోనే సాగాలని పంచాయతీ కార్యదర్శులు, ఈఓఅండ్‌పీఆర్ ఆర్‌డీలను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వైఓ నందన్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి, పీఓ శైలజ, ఏపీఓలు ఆసిఫ్, కృష్ణసింగ్, డీఎల్‌పీఓలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు వేగవంత పరిష్కారం

ప్రజా సమస్యలకు వేగవంత పరిష్కారం ఇవ్వాలని కలెక్టర్ విజయరామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల వినతులను ఆయా శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. పారదర్శకంగా విచారణ నిర్వహించాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనంద్ నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సారే ఇవ్వాలి!

- కడప గాంధీనగర్ స్కూల్‌లో ఆసక్తికర ఘటన



మానసిక దివ్యాంగురాలికి నగదు ఇస్తున్న జిల్లా కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్ : కడప గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఓ ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఓ మానసిక దివ్యాంగురాలు జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమం వద్దకు వచ్చింది. దానం చేయాలని కోరింది. ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి ఆమెకు రూ.వంద నోటును ఇవ్వబోగా ఆమె తిరస్కరించింది. కలెక్టర్ సారు ఇస్తేనే తీసుకుంటానని పట్టుబట్టడంతో ఆయనే స్వయంగా స్టేజీ దిగి వచ్చి రూ. 500 నోటు ఇచ్చారు. దాంతో ఆమె సంతృప్తి చెందక మరొకటి కావాలనడంతో కలెక్టర్ మరో రూ. 500 ఆమెకు ఇచ్చారు. దీంతో ఆమె కలెక్టర్ పాదాలకు నమస్కరించి చిరునవ్వుతో వెళ్లిపోయింది.

రాష్ట్రంలో ప్రజల ప్రభుత్వం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజా సమస్యలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారన్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు చేసిన పాపాన పోలేదన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అంటే గుర్తుకు వచ్చే నాయకులు దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో వైఎస్సార్ ఒక్క అడుగు ముందుకు వేస్తే.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు అడుగులు ముందుకు వేసి తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నాడన్నారు. అనంతరం ఆయన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

కాంట్రాక్టు లెక్చరర్ల సన్మానం : ఇటీవల ప్రభుత్వ నూతన జీఓ ప్రకారం ఉద్యోగాలు పర్మినెంట్ అయిన కాంట్రాక్టు లెక్చరర్లు సోమవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వైఎస్సార్ విద్యుత్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎంపీని కలిసి విద్యుత్ కార్మికులను రెగ్యులర్ అయ్యేలా చూడాలని కోరారు.

ఖరీఫ్ సాగుకు సర్వం సిద్ధం

- జిల్లాలో 77,105 హెక్టార్లు సాగు లక్ష్యం
- అందుబాటులో 5730 క్వింటాళ్ల వేరుశనగ
- 2636 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు
- 59,342.89 మెట్రిక్ టన్నుల ఎరువులు
- ఆర్‌బీకేల్లో మొదలైన విత్తనాల పంపిణీ
- పచ్చిరొట్ట విత్తనాల సాగుకు ఇదే అదును
- సన్నద్ధమవుతున్న రైతాంగం



సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్న



గోడౌన్‌లో సిద్ధంగా ఉన్న ఎరువులు

కడప అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. విత్తనం మొదలు పంట దిగుబడుల విక్రయం వరకు సహకారం అందిస్తోంది. ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల పంటల సాగుకు అవసరమైన ఎరువులతోపాటు వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలను ముందస్తుగా కేటాయించింది. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు, వేరుశనగకాయల పంపిణీ ప్రారంభించారు. దీంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు.

జిల్లాలో 77,105 హెక్టార్లు సాగు లక్ష్యం..

ఖరీఫ్ సాగుకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ ఏడాది జిల్లాలోని 36 మండలాల్లో 77,105 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలను సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని ఆధారంగా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేశారు. ఇందులో 8366 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయడం ప్రారంభించారు. వీటితోపాటు వివిధ రకాల ఎరువులు 59,342.89 మెట్రిక్ టన్నులు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. వీటన్నింటిని అవసరాన్ని బట్టి ఆయా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించనున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో జిల్లాలోని 432 కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీ ముమ్మరంగా జరుగుతోంది.

జిల్లాలో పంటల సాగు ఇలా..

ఖరీఫ్ -2023 సాధారణ విస్తీర్ణం 77105 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు కావచ్చని వ్యవసాయ అధికారులు గుర్తించారు. ఇందులో కేసీ కెనాల్‌తోపాటు నీటి ఆధారంగా ఈ ఏడాది అత్యధికంగా 33,215 హెక్టార్లలో సాధారణ వరిపంట సాగు కానుంది. అలాగే 21,566 హెక్టార్లలో పత్తి, 5739 హెక్టార్లలో వేరుశనగ, 3453 హెక్టార్లలో శనగ, 3044 హెక్టార్లలో పసుపు, 1817 హెక్టార్లలో మినుము, 1332 హెక్టార్లలో జొన్న, 1170 హెక్టార్లలో పొద్దుతిరుగుడు, 1025 హెక్టార్లలో సజ్జలు, 936 హెక్టార్లలో కొర్ర, 570 హెక్టార్లలో మొక్కజొన్నతోపాటు పలు పంటలను సాగు చేయనున్నారు.

నైరుతిపై ఆశలు..

ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతోపాటు నైరుతి రుతుపవనాలు రాష్ట్రానికి ఆగమనం కానుండటంతో రైతన్నల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికే రైతులకు కావాల్సిన విత్తనాలను సబ్సిడీతో పంపిణీ చేస్తున్నారు. దీంతోపాటు అవసరమైన ఎరువులను సిద్ధం చేస్తున్నారు. రైతులు కూడా తమ పశువుల ఎరువులను భూములకు తోలుతూ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో పదును వర్షం కురిస్తే దుక్కులు దున్ని సత్తువ పంటలను సాగు చేసుకోనున్నారు. ఇప్పటికే నీటి ఆధారిత ప్రాంతాల్లో పలువురు రైతులు జీలుగలు, జనుములను సాగు చేసుకున్నారు. కుందూ, పెన్నా నదీ పరివాహక ప్రాంతాల్లో ముందస్తుగా సాగు చేసుకునే వారు అక్కడక్కడా నారుమడులను కూడా సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాలు కురవగానే ఆరుతడి పంటలను సాగు చేసుకునే రైతాంగం లోతైన సేద్యాలను చేసుకోవాలని కేవీకే శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల కేటాయింపు ఇలా...

ఉత్పత్తి	ఏప్రిల్	మే	జూన్	జులై	ఆగస్టు	సెప్టెంబర్	మొత్తం
యూరియా	1298.95	735.8	1476.34	1892.91	3347.51	3836.36	12587.17
డీఏపీ	172.78	158.78	328.56	824.78	1852.60	2349.55	5687.05
ఎంఓపీ	215.78	208.65	419.30	541.82	639.22	638.22	2662.99
కాంప్లెక్స్	2242.88	1499.15	2895.75	4135.44	8054.54	16506.28	35334.04
ఎస్ఎస్‌పి	154.52	213.65	505.82	560.22	930.17	707.26	3071.64
మొత్తం	4084.91	2815.31	5625.77	7955.17	14828.04	24037.69	59342.89

సర్వం సిద్ధం చేశాం..



ఖరీఫ్ సీజన్‌లో రైతుల సాగుకు కావాల్సిన విత్తనాలను, ఎరువులను సకాలంలో అందించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశాము. ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా విత్తనాల పంపిణీ సాగుతోంది. దీంతోపాటు ఎరువులను కూడా ఆయా ప్రాంతాల అవసరాలను బట్టి ఆయా రైతు భరోసా కేంద్రాలను సిద్ధం చేస్తాం. విత్తనాలు కావాల్సిన వారు ఆర్‌బీకేలో పేర్లను నమోదు చేసి తీసుకెళ్లాలి. ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం కంటే అధిక విస్తీర్ణంలో పంటలను సాగు చేసేందుకు లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

- అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

పండ్ల తోటల దరఖాస్తుకు గడువు పెంపు

కడప సిటీ: ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి సంబంధించి దరఖాస్తుల గడువు ఈనెల 15వ తేదీ వరకు పొడిగించారని డ్వామా పీడీ యదుభూషణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10వ తేదీ వరకు చివరి గడువు ఉండగా, మరో ఐదు రోజులు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తించి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రావాలన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 5500 ఎకరాలు లక్ష్యం కాగా, ఇంతవరకు 1500 ఎకరాలకు 592 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. 235 మంది రైతులకు సంబంధించి 2700 ఎకరాలు గుర్తించి ప్రతిపాదనలు పంపామన్నారు. 353 మంది రైతులకుగాను 837 ఎకరాలకు ప్రస్తుతం పండ్ల తోటల పెంపకానికి అర్హులైనట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో 14 రకాల పండ్ల తోటలకు సంబంధించి మొక్కల పెంపకానికి పూర్తిగా ఉచితంగానే ప్రభుత్వం భరిస్తోందని పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈ డైరెక్టర్‌గా వెంకట సుబ్బారెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న చల్లా వెంకట సుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్:ఎంఎస్ఎంఈ డైరెక్టర్‌గా చల్లా వెంకట సుబ్బారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఏపీఐఐసీ కార్యాలయంలో వీసీ అండ్ ఎండీ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఏడుగురిపై హత్యాయత్నం కేసు

ముద్దనూరు : మండలంలోని యామవరం సమీపంలో ఇద్దరిపై జరిగిన దాడి ఘటనలో పోలీసులు ఏడుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు సోమవారం ఎస్‌ఐ చంద్రమోహన్‌ వివరాలు వెల్లడించారు. కొండాపురం మండలం బుక్కపట్నం గ్రామానికి చెందిన పాములేటి బంధువుల మళ్లిపెళ్లి ఆదివారం ఎర్రగుంట్ల మండలం కర్చుగుంటపల్లెలో జరిగింది. ఈ వివాహానికి పాములేటి దాయాదులు రంజిత్‌కుమార్‌. సురేష్‌ తదితరులు హాజరయ్యారు. వారు పాములేటి వద్దకు వచ్చి నీవు మాకు వ్యతిరేకపార్టీలో ఉండి ఏమి సంపాదించావు అని మాట్లాడుతూ గొడవకు దిగారు. అక్కడ ఉన్నవారు సర్దిచెప్పి పంపించారు. పెళ్లి తర్వాత పాములేటి, అదేగ్రామానికి చెందిన నాగరాజు, సరోజమ్మలు ఆటోలో గ్రామానికి బయలుదేరారు. యామవరం గ్రామ శివారుకు చేరేసరికి రంజిత్‌ కుమార్‌,సురేష్‌లతో పాటు మరో ఐదుగురు ఆటోను ఆపి కత్తితో దాడిచేశారు. ఈ దాడిలో పాములేటి చేతికి గాయాలయ్యాయి. నాగరాజును పలువురు కాళ్లు చేతులతో తన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏడుగురిపై హత్యాయత్నం కేసు నమోదుచేశారు. సోమవారం ఆరుగురు నిందితులను కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


వరప్రకాష్‌ రావు మృతదేహం

కడప అర్బన్‌ : కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని రామరాజుపల్లిలో వరప్రకాష్‌ రావు (45) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనికి భార్య సబిత, కుమారుడు ఉన్నారు. ఈఎంఐలు చెల్లించలేక ఈ చర్యకు పాల్పడ్డాడని భార్య తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా సీఐ ఉలసయ్య తెలియజేశారు.

తండ్రి మందలించాడని..

మదనపల్లె : ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలో జరిగింది. వలసపల్లె పంచాయతీ కృష్ణాపురం జ్యూస్‌ఫ్యాక్టరీ సమీపంలో నివాసం ఉన్న రమణ రెండో కుమారుడు బాలకృష్ణ(22) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అవివాహితుడు. కొంతకాలంగా పనులకు సక్రమంగా వెళ్లకుండా, సెల్‌ఫోన్‌లో ఎక్కువ సమయం చాటింగ్‌ చేస్తుండటంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన బాలకృష్ణ ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

సురక్షిత ప్రయాణం ఉచితం

- విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులు
- దరఖాస్తులకు ఆర్టీసీ ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : జిల్లాలోని ఆరు ఆర్టీసీ డిపోల నుంచి (బద్వేలు, కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల) విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత రాయితీ బస్సు పాసులు అందించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థుల చదువుకు ఊతం ఇచ్చేలా ఏటా ఆర్టీసీ పాసులు జారీ చేస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా ఉచిత రాయితీ పాసుల కోసం ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ మేరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌ఆర్టీసీపాస్‌.ఇన్‌ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బాలురకు 12 ఏళ్లు, బాలికలకు 18 ఏళ్లు నిండే వరకు ఉచిత పాసులు అందిస్తున్నారు. వీటి ద్వారా విద్యార్థులు తమనివాసం నుంచి 20 కిలోమీటర్ల వరకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇందుకోసం విద్యార్థి ఫోటో, స్కూలు యాజమాన్యం నుంచి బోనాఫైడ్‌ సర్టిఫికెట్‌ సమర్పించాలి. అలాగే పాస్‌ ఐడెంటిటీ కార్డు నిమిత్తం రూ. 50 చెల్లించాలి.

సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ అందిస్తున్న ఉచిత, రాయితీ బస్సు పాసులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. అలాగే దివ్యాంగులు కూడా ఉచిత పాసులు పొంది సురక్షితంగా ప్రయాణించాలి. కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ప్రయాణ ఖర్చు ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే భరిస్తూ పాసులు అందిస్తోంది. జిల్లాలోని ఆరు డిపోల ద్వారా వీటిని జారీ చేస్తున్నాం.

- గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

దివ్యాంగులకు

ఏపీఎస్‌ ఆర్టీసీ దివ్యాంగులకు ఉచిత పాసులు అందిస్తోంది. వీరు సదరన్‌ సర్టిఫికెట్‌, ఆధార్‌కార్డు, అన్‌ ఎంప్లాయ్‌మెంట్‌ సర్టిఫికెట్‌ సమర్పించాలి. మూడేళ్ల కాల వ్యవధితో పాసులు జారీ చేస్తారు. వీరు ఐడీ కార్డు కోసం రూ. 100 చెల్లించాల్సి ఉంటుంది.

గతేడాది 12,560 పాసులు జారీ

వైఎస్సార్‌ జిల్లాలో ఆరు డిపోల నుంచి 12,560 ఉచిత రాయితీ బస్సు పాసులు జారీ చేశారు. ఇందులో దివ్యాంగులకు 3500, విద్యార్థులకులకు 12,560, రాయితీ పాసులు 22,450 ఉన్నాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ. 13,71,32,000 భరించింది. ఇతర వివరాలకు ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలి.

రాయితీ పాసులు

చదువుకునే ప్రతి విద్యార్థికి ఈ పాసును పొందవచ్చు. ఛార్జీలో ఒకవంతు మాత్రమే విద్యార్థి చెల్లించేలా పాసులు జారీ చేస్తారు. విద్యార్థి నివాసం నుంచి 50 కిలోమీటర్ల వరకు రాయితీ పాసును జారీ చేస్తారు. అయితే కళాశాల నుంచి బోనాఫైడ్‌ సర్టిఫికెట్‌ను సమర్పించాలి. విద్యార్థి ఒక ఫోటో జత చేయాలి. దీనిలో విద్యార్థి నెలవారీగా, మూడు నెలలకు, సంవత్సరం పాసులను పొందవచ్చు. మంత్లీ పాసు ఐడీ కార్డుకు రూ. 50, క్వార్టర్లీ, ఇయర్లీ పాసుల ఐడీ కార్డులకు రూ. 100 చెల్లించాలి. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని, ప్రైవేటు వాహనాల్లో ఎక్కి విద్యార్థులు ప్రమాదాలకుగురి కావద్దని అధికారులు సూచిస్తున్నారు.

27 నుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీఈవో నటేష్‌బాబు

నందలూరు(రాజంపేట) : జిల్లాలో ప్రసిద్ధి చెందిన నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) తొలిసారిగా నిర్వహించనుంది. ఈనెల 27 నుంచి జరిపేందుకు సన్నాహాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీఈవో నటేష్‌బాబు ఆలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ మాజీ చైర్మన్‌ అరిగెల సౌమిత్రితో కలిసి ఆలయం వారితో చర్చలు జరిపారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల తరహాలోనే సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారనే భావనలో భక్తులు ఉన్నారని, ఆ విధంగా చేయాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి నేతృత్వంలో టీటీడీ చైర్మన్‌ వైవీసుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డిలతో మాట్లాడతామని చెప్పారు.

బ్రహ్మోత్సవాల్లో స్వామివారు ఊరేగే వాహనాలను సిద్ధం చేస్తున్నారు.స్వామి కల్యాణోత్సవం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు కూడా టీటీడీ దృష్టి సారించింది. ఈసందర్భంగా టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌ బాబు మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ప్రచార సామగ్రి సిద్ధమవుతోందన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో దాతల భాగస్వామ్యం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సౌమ్యనాథాలయ మాజీ చైర్మన్‌ అరిగెల సౌమిత్రి, టెంపుల్‌ ఇన్‌స్పెక్టర్‌ దిలీప్‌, మండల కో–ఆప్షన్‌ సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధానకార్యదర్శి నడివీధి సుధాకర్‌, నాయకులు తుమ్మల శ్రీధర్‌ గౌడ్‌, రైల్వేభాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా:యువకుడి దుర్మరణం

ముద్దనూరు : మండలపరిధిలోని బొందలకుంట సమీపంలో సోమవారం ఆటో బోల్తా పడింది.ఈ ఘటనలో చత్తీస్‌ఘడ్‌ రాష్ట్రానికి చెందిన కూలి విశాల్‌(19) దుర్మరణం చెందాడు. ప్రత్యక్ష సాక్షుల సమాచారం మేరకు చత్తీస్‌ఘడ్‌కు చెందిన నలుగురు కూలీలు బొందలకుంట గ్రామంలో ఇంటి నిర్మాణం పనులకు వెళ్లారు.వీరు ఎర్రగుంట్లలో నివాసం ఉంటున్నారు. పని ముగించుకుని ఆటోలో సోమవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఎర్రగుంట్లకు బయలుదేరారు. బొందలకుంట రహదారి మలుపులో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో విశాల్‌ మృతి చెందాడు.మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయని తెలిపారు.

గ్రేడింగ్‌లో మార్పుతో పసుపు రైతుల్లో హర్షం

- మార్కెట్‌ ధర కంటే ప్రభుత్వం రూ.1850 అదనంగా ఇస్తోంది
- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


పసుపు పంట గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, తిరుపాల్‌రెడ్డి

మైదుకూరు : పసుపు పంట కొనుగోళ్లలో గ్రేడింగ్‌ను సరళతరం చేయడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. కొద్ది రోజుల కిందట అమలు చేసిన జల్లెడ విధానాన్ని వదిలి గ్రేడింగ్‌ యంత్రాన్ని వినియోగిస్తుండటంతో రైతులు నష్టపోయే అవకాశం లేదని ఆయన పేర్కొన్నారు. సోమవారం మైదుకూరులోని పసుపు కొనుగోలు కేంద్రంలో పసుపు పంట గ్రేడింగ్‌ను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడారు. గ్రేడింగ్‌ యంత్రంతో క్వింటాల్‌కు ఒక కిలో మాత్రమే వ్యర్థాలు పోతున్నాయని రైతులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పండుతున్న పసుపు పంటలో 50 శాతం మైదుకూరు నియోజకవర్గంలోనే సాగవుతోందన్నారు. రైతుల అభ్యర్థనను సీఎం వైఎస్‌ జగన్‌ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన అదేశంతో అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. మైదుకూరు, ఖాజీపేట కేంద్రాలుగా 2,200 మెట్రిక్‌ టన్నుల పంటను కొనుగోలు చేయనున్నట్టు పేర్కొన్నారు. మైదుకూరులో రోజుకు 500 నుంచి 600 క్వింటాళ్ల గ్రేడింగ్‌ అవుతున్నట్టు చెప్పారు. కొనుగోళ్లు ఈనెలాఖరు వరకే ఉన్నందున మరొక గ్రేడింగ్‌ మిషన్‌ ఏర్పాటు చేసి రోజూ వెయ్యి క్వింటాళ్ల గ్రేడింగ్‌ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

క్వింటాల్‌కు రూ.1850 అదనం

ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు పంటకు ఉన్న ధరతో పోలిస్తే ప్రభుత్వం ఇస్తున్న రూ.6,850 క్వింటాల్‌కు రూ.1850 అదనంగా ఉందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఆ మేరకు నియోజకవర్గంలోని రైతుల నుంచి కొనుగోలు చేయనున్న 2,200 మెట్రిక్‌ టన్నుల పంటకు ప్రభుత్వం రూ.41కోట్లు అదనంగా రైతులకు లబ్ధి చేకూర్చినట్టని ఆయన వివరించారు.

గతేడాది పంటనూ కొనుగోలుకు కృషి

రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ నష్టపోకుడదని సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి అన్నారు. అందువల్లే పసుపు కొనుగోలు కేంద్రాల్లో గ్రేడింగ్‌ను సరళతరం చేశారని అన్నారు. గతేడాది గిట్టుబాటు ధర లేక విక్రయించకుండా ఉన్న పసుపు పంటను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారని తెలిపారు. వారి అభ్యర్థనను సీఎం దృష్టికి తీసుకెళ్లి పంటను కొనుగోలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌ విండో చైర్మన్‌ మూలె సుధాకర్‌రెడ్డి హార్టికల్చర్‌ అధికారి రామ్మకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘురామయ్య, ఏసీకే చెంద్రాయుడు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌

కడప అర్బన్‌ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

హార్డ్‌వేర్స్‌ దుకాణం దగ్ధం: రూ.30లక్షల నష్టం

వాల్మీకిపురం : అన్నమయ్య జిల్లా తరిగొండ రోడ్డులోని ఎంకె హార్డ్‌వేర్‌ షాపులో సోమవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి భారీ నష్టం వాటిల్లింది. గుర్రంకొండ మండలం మర్రిపాడుకు చెందిన జుబేర్‌, ఉమ్మర్‌ వాల్మీకిపురంలోని తరిగొండ రోడ్డులో సొంత దుకాణం నిర్మించుకొని హార్డ్‌వేర్‌ షాపు నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. దుకాణంలో పెయింట్స్‌, ప్లాస్టిక్‌, కెమికల్స్‌కు సంబంధించిన వస్తువులు ఉండడంతో పాటు గోడౌన్‌ కూడా ఫస్ట్‌ ఫ్లోర్‌లో ఉంది. అందులోనూ ఎలక్ట్రిక్‌ వస్తువులు, పెయింట్స్‌ ఉన్నాయి.ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రెండు ఫ్లోర్‌లలోని వస్తువులు అంటుకున్నాయి. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటంతో భవనం మొత్తం కాలిపోయింది. దీంతో హార్డ్‌వేర్‌ దుకాణంలో దాదాపు రూ. 30లక్షలు నష్టం వాటిల్లింది. సకాలంలో సంఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, పంచాయతీ ఉపసర్పంచ్‌ కేశవ రెడ్డి పంచాయతీ ట్యాంకర్లను తెప్పించారు. స్థానిక యువకుల సహకారంతో మంటలను అదుపుచేశారు.

బంగారు, నగదుతో ఉడాయించిన ఆటో డ్రైవర్‌ అరెస్ట్‌


నిందితుడి అరెస్ట్‌ వివరాలను తెలియజేస్తున్న కడప డీఎస్పీ ఎండీ షరీఫ్‌


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదు

కడప అర్బన్‌ : కడప వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బంగారు ఆభరణాలు, నగదుతో ఉడాయించిన ఆటో డ్రైవర్‌ను కేసు నమోదు చేసిన 24 గంటల్లోనే పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి దాదాపు 20 లక్షల విలువైన 354 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.80 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఈ సంఘటన వివరాలను సోమవారం తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కడప డీఎస్పీ ఎండీ షరీఫ్‌ తెలియజేశారు. కడప నగరంలోని పీఎఫ్‌ ఆఫీస్‌ ఎదురుగా ఉన్న తిరుమల అపార్ట్‌మెంట్‌ సమీపంలో కుటుంబసభ్యులతో కడప రైల్వే స్టేషన్‌నుంచి ఆటోలో నుంచి లగేజీతో పోతుల ప్రమీల దిగారు. ఆ సమయంలో ఆటో డ్రైవరు వీరి బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగ్‌ను తనతో పాటు తీసుకెళ్లాడు. తిరుపతికి చెందిన పోతుల ప్రమీల ఈనెల 9వ తేదీన కడపలో తన కుమార్తె నీరజ 'గృహప్రవేశం'కు కుటుంబ సభ్యులతో కలిసి రైలులో వచ్చి కడప రైల్వేస్టేషన్‌లో దిగారు. అక్కడి నుంచి విశ్రాంతి తీసుకునేందుకు ఆటోలో ఎక్కి తిరుమల అపార్ట్‌మెంట్‌ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో తమ వెంట తెచ్చుకున్న లగేజి బ్యాగ్‌లను దించుకున్నారు. బంగారు నగలు, నగదు ఉన్న బ్యాగ్‌ ఆటోలో ఉండిపోయింది. వాళ్లను దించేసి డ్రైవర్‌ ఉడాయించాడు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేసిన పోలీసులు ఈనెల 11న కేసు నమోదు చేశారు. సీసీకెమెరాల నిఘా ద్వారా కడప వన్‌టౌన్‌ సీఐ ఎస్‌.వి నాగరాజు, ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, ఏఎస్‌ఐ ఖాదర్‌వల్లీ, కానిస్టేబుళ్లు ఖాదర్‌ హుసేన్‌, నారాయణ రెడ్డిలు బృందంగా ఏర్పడి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. పోతుల ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కిలాడీ ఆటో డ్రైవర్‌ను ఆటో(ఏపి39 ఎక్స్‌ 4692)తో సహా వై-జంక్షన్‌ వద్ద అరెస్ట్‌ చేశారు.

నిందితుడు పెండ్లిమర్రి మండలం యార్లపాడు గ్రామానికి చెందిన నాగులగారి మధుసూదన్‌రెడ్డి. అతను ప్రస్తుతం కడప నగరంలోని ఎస్‌బిఐ కాలనీలో నివాసం ఉంటున్నాడు. తన ఆటో ఎక్కిన వారు బంగారు ఆభరణాలు, డబ్బులున్న బ్యాగ్‌ గురించి మాట్లాడుకుంటుండగా విని ఈ నేరానికి పాల్పడినట్లుగా పోలీసులు విచారణలో తెలుసుకున్నారు. అతని వద్ద నుంచి ఆటో, 354 గ్రాముల బంగారు ఆభరణాలు, 80 వేలు నగదును సీజ్‌ చేశారు. నిందితుడిని అరెస్ట్‌ చేయడంలో కృషి చేసిన సీఐ, ఎస్‌ఐ, సిబ్బందిని డీఎస్పీ అభినందించి, నగదు రివార్డులను అందజేశారు.

లోకేష్‌ పాదయాత్రలో అపశ్రుతి


దగ్ధమవుతున్న గడ్డివాములు

బద్వేలు అర్బన్‌ : నారాలోకేష్‌ యువగళం పాదయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. సోమవారం సాయంత్రం వైఎస్సార్‌ జిల్లా విద్యానగర్‌ విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభించిన కొద్దిసేపటికే కార్యకర్తలు టపాసులు పేల్చడంతో నిప్పురవ్వలు ఎగిసిపడి విద్యానగర్‌ సమీపంలో ఆర్‌.విజయమ్మ, ఆర్‌. నాగమ్మలకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. వేసవికాలం పశువులకు మేత దొరకని కష్ట సమయంలో ఉన్న గడ్డివాములు దగ్ధమవడంపై మహిళలు బోరున విలపించారు. ఈ ఘటనలో సుమారు రూ.70 వేలు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పీలేరురూరల్‌ : లారీ – ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికీ గాయాలైన సంఘటన అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణం నాలుగు రోడ్ల కూడలిలో చోటు చేసుకుంది. పీలేరు మండలం అగ్రహారం పంచాయతీ కంభంమిట్టపల్లెకు చెందిన వెంకటేశ్వర్‌రావు (40), దామోదర్‌రావు (27) ద్విచక్రవాహనంలో పీలేరుకు వచ్చారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో రాయచోటి వైపు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్‌రావు, దామోదార్‌రావు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, ట్రాక్టర్‌ ఢీకొని..

మదనపల్లె : ఆటోను ట్రాక్టర్‌ ఢీకొన్న రోడ్డుప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మండలంలో జరిగింది. కాటిపేరి పంచాయతీ అగస్తిగానిపల్లెకు చెందిన ఎగువమిద్దె రాజమ్మ(50), యు.రెడ్డెప్ప(60), అతని కుమారుడు శేఖర్‌(40)లతో కలిసి 12 మంది ప్రయాణికులు కాగతి నుంచి ఆటోలో గ్రామానికి బయలుదేరారు. గిరిజాపురం వద్ద ఆటోను ట్రాక్టర్‌ ఢీకొంది. ప్రమాదంలో అగస్తిగానిపల్లెకు చెందిన రాజమ్మ(50), తండ్రీ కొడుకులు రెడ్డెప్ప, శేఖర్‌లు తీవ్రంగా గాయపడ్డారు.

సహజవాయువుల కోసం అన్వేషణ


కోనవారిపల్లె గ్రామం వద్ద బోరుబావి తవ్వుతున్న దృశ్యం

కొండాపురం : భూమిలో దాగి ఉన్న సహజవాయువు నిక్షేపాల కోసం సర్వే జరుగుతోంది. మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఓఎన్‌జీసీ (ఆయిల్‌, నేచురల్‌గ్యాస్‌ కార్పొరేషన్‌) నియమించిన బృందం జల్లెడ పడుతోంది. సోమవారం మండల పరిధిలోని కోనవారిపల్లె,కె.సుగుమంచిపల్లె, బురుజుపల్లె రెవెన్యూ పొలాల్లో పరిశోధనలు జరిగాయి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భూమిలోని చమురు,సహజవాయువుల నిక్షేపాల శాతాన్ని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో డ్రిల్లింగ్‌ పనులను ప్రారంభించారు. 30 నుంచి 35 మీటర్లవరకు బోరుబావులు తవ్వుతున్నారు. సర్వే పనులు పూర్తి కావడానికి రెండు నెలలు పడుతుందని సంస్థ అధికారులు చెబుతున్నారు.

కేవీకే రైతుకు రాష్ట్రస్థాయి పురస్కారం


అతిథుల నుంచి పురస్కారం అందుకుంటున్న రైతు మోపూరు శ్రీనాథరెడ్డి

కడప అగ్రికల్చర్‌ : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 59వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా రాష్ట్రస్థాయి పురస్కారాలను అందజేస్తారు. ఇందులో భాగంగా 2023 సంవత్సరానికి కడప ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే) అభ్యుదయ రైతు, ఉమ్మడి వైఎస్సార్‌ జిల్లా రామాపురం మండలం రాచపల్లి గ్రామానికి చెందిన మోపూరు శ్రీనాథరెడ్డికి పురస్కారం లభించింది.వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ నిర్వహణ తదితరల వ్యూహాలను అదించడంతో ఆయన రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గౌరవ ఉపకులపతి డాక్టర్‌ విష్ణువర్ధన్‌రెడ్డి, పూర్వ ఉపకులపతి రఘువర్ధన్‌రెడ్డి, న్యూఢిల్లీ భారత వ్యవసాయ పరిశోధన సంస్థ పూర్వపు కార్యదర్శి, డైరెక్టర్‌ జనరల్‌ త్రిలోచన్‌ మహాపాత్ర హాజరయ్యారు. శ్రీనాథరెడ్డికి రూ. 25 వేల నగదు, పురస్కారం, జ్ఞాపికను అందజేశారు.